# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 4 pm

శుక్రవారం 28-7-2023


## వరద ఎఫెక్ట్ ప్రయాణికులకు ముఖ్య గమనిక



హైదరాబాద్ – విజయవాడ రెగ్యులర్ సర్వీసులు రద్దు

వయా పిడుగురాళ్ల, గుంటూరు మీదుగా బస్సులు

ట్విట్టర్ ద్వారా టీఎస్ఆర్టీసీ ఎండి సజ్జనార్

**హైదరాబాద్, జూలై28(తెలుగుప్రభ):**

హైదరాబాద్ – వి జయవాడ జాతీయ రహదారిపై వరద ప్రవాహం కొనసాగుతుండటంతో టీఎస్ఆర్టీసీ రెగ్యులర్ బస్ సర్వీసులను రద్దు చేసింది. ఈమేరకు టీఎస్ఆర్టీసీ ఎండి వీసీ సజ్జనార్ ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. ఏపీలోని కృష్ణాజిల్లా కీసర టోల్‌గేట్ సమీపంలోని ఐతవరం వద్ద మున్నేరు వాగు ఉధృతి వల్ల ఆ మార్గంలో రాకపోకలు స్తంభించినందున టీఎస్ఆర్టీసీ రెగ్యులర్ సర్వీసులు రద్దు చేసినట్లు తెలిపారు. ప్రత్యామ్నాయంగా హైదరాబాద్ నుంచి వెళ్లే ప్రయాణికుల కోసం మిర్యాలగూడ,పిడుగురాళ్ల,గుంటూరు మీదుగా వెళ్లేలా బస్సులు విజయవాడకు బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ మార్గంలో వెళ్లే బస్సులు ఎంజీబీఎస్ నుంచి ప్రతి అరగంటకోబస్సు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని, అదనపు సమాచారం కోసం టీఎస్ఆర్టీసీ కాల్‌సెంటర్ నెంబర్లలో (040–69440000,040–23450033) సంప్రదించవచ్చునని తెలిపారు.

## జీహెచ్ఎంసీ సిబ్బందికి హ్యాట్సాఫ్

**హైదరాబాద్, జూలై 28 (తెలుగుప్రభ)**

వరద ప్రభావిత ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ సిబ్బంది చేస్తున్న సేవలకు ప్రశంసలు అందుతున్నాయి. మంత్రి కేటీఆర్, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 24 గంటలూ కంటి మీద కునుకు లేకుండా లోతట్టు ప్రాంతాల్లో సిబ్బంది సేవలు అందిస్తున్నారు. వరద నీరు దారి మళ్లించే చర్యలు తీసుకుంటున్నారు.



నగరాన్ని వాన వీడడం లేదు. భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ నగరవాసులు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అధికార యంత్రాంగం కంటి మీద కునుకు లేకుండా పనిచేస్తున్నది. ప్రాణ నష్టం జరుగకుండా, ఎలాంటి విపత్కర పరిస్థితులైనా.. ఎదుర్కొనేందుకు అనుక్షణం అప్రమత్తంగా ఉంటోంది. నీరు నిలిచిపోవడం, చెట్లు కూలిపోవడం, మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లడం వంటి ఫిర్యాదులపై బల్దియా తక్షణం స్పందించి.. వీలైనంత త్వరగా వాటిని పరిష్కరిస్తున్నది. పారిశుధ్య నిర్వహణ, చెత్త తొలగింపు వంటివి నిరంతరాయంగా కొనసాగిస్తున్నది. దెబ్బతిన్న రహదారులను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపడుతున్నది. అలాగే అన్ని శాఖల అధికారులు కార్యాలయాలు వదిలి క్షేత్రస్థాయిలోనే పనిచేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు పర్యటిస్తూ.. బాధితులకు భరోసా కల్పిస్తున్నారు. మేమున్నాం.. అధైర్యపడొద్దని అభయమిస్తున్నారు. మంత్రి కేటీఆర్ హుస్సేన్ సాగర్‌లో వరద పరిస్థితిని, మూసారాంబాగ్, చాదర్‌ఘాట్ వంతెనల వద్ద మూసీ ఉధృతిని పరిశీలించారు.



# పల్లె కన్నీరు పెడుతోంది..

### బోరున విలపిస్తున్న మోరంచపల్లె

### చెట్టుకొకరు.. పుట్టకొకరుగా గ్రామస్థులు

**మొన్నటి వరకు ఆ పల్లె పచ్చగా కళకళలాడేది. గ్రామస్థులందరూ తమ తమ పనులు చేసుకుంటూ ఉన్నదాంట్లో ఆనందంగా జీవించారు. పశుగ్రాసాలతో, కుటుంబసభ్యులతో కలిసిమెలిసి హాయిగా సాగిపోతున్న ఆ గ్రామాన్ని వరద రూపంలో పెద్ద బెడద చుట్టుముట్టింది. మొత్తం గ్రామాన్నే కకావికలం చేసింది. ఏ ఇంట చూసినా నీరే.. ఎవరి కంట చూసినా కన్నీరే..**

భూపాలపల్లి, జూలై 28 (తెలుగుప్రభ)

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఓ ఊరు ఊరంతా జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఇళ్లు, భవనాలు మునిగిపోవడంతో మేడలపైకి వెళ్లి.. వర్షాల్లో తడుస్తూ మమ్మల్ని కాపాడండి ప్లీజ్ అంటూ.. సెల్ఫీవీడియోలు తీసి నెట్టింట పోస్ట్ చేయగా.. అవి వైరల్ అయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మోరంచపల్లె గ్రామస్తుల దయనీయ పరిస్థితి ఇది. ప్రభుత్వం బుధవారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీవర్షానికి మోరంచవాగు ఉగ్రరూపం దాల్చింది. భూపాలపల్లి – పరకాల ప్రధాన రహదారిపై మోరంచపల్లి వద్ద సుమారు 15 అడుగుల ఎత్తులో వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. కట్టలు తెంచుకుని ఊరిపై పడిన వాగు.. అర్ధరాత్రి గ్రామాన్ని ముంచెత్తింది. ప్రభుత్వం వెంటనే హెలికాప్టర్ల ద్వారా సహాయక చర్యలు అందిస్తోంది.

మోరంచపల్లె గ్రామంలో సుమారు 1500 మంది జనాభా ఉంటారని అంచనా. అందరూ జలదిగ్బంధంలో చిక్కుకుపోయారు. ప్రభుత్వం వారిని అందరినీ పునరావాస కేంద్రాలకు తరలించి, కావాల్సిన సహాయక చర్యలు చేపడుతోంది. అయితే.. వరద బీభత్సవానికి కూడు.. గూడు, గుడ్డ.. మొత్తం చినాభిన్నం అయ్యాయి. కట్టుకునేందుకు బట్ట లేదు. తినేందుకు తిండి లేదు. ఆ ఇంటి పరిసరాలను చూసి కన్నీరుమున్నీరు అవుతున్నారు. వరద ఉద్ధృతిలో ముగ్గురు కొట్టుకుపోయినట్లు లారీ డ్రైవర్లు చెబుతున్నారు. మోరంచపల్లె గ్రామస్తులను కాపాడేందుకు అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. హెలికాప్టర్, బోట్ల ద్వారా గ్రామప్రజలను రక్షిస్తోంది.





# మూడు రోజుల్లో కేబినెట్ మీటింగ్

### కీలక నిర్ణయాలు తీసుకునే చాన్స్

### ఎన్నికల నేపథ్యంలో ఉత్కంఠ

**హైదరాబాద్, జూలై 28 (తెలుగుప్రభ)**

త్వరలోనే తెలంగాణ కేబినెట్ సమావేశం జరగనుంది. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో ఈ సమావేశానికి విశిష్ఠత ఏర్పడింది. ఇప్పటికే సంక్షేమ ఒరవడిలో కీలక నిర్ణయాలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు కేబినెట్ భేటీలో మరిన్ని వరాలు ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెల 31న మధ్యాహ్నం 2 గంటల నుంచి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. సమావేశంలో దాదాపు 40 నుంచి 50 అంశాలపై చర్చ జరగనున్నట్లు తెలుస్తోంది. భారీ నుంచి అతి భారీ వర్షాల నేపథ్యంలో సంభవించిన వరదలు, ప్రభుత్వ చర్యలపై కూడా కేబినెట్ సమీక్షించనుంది. రాష్ట్రంలో రైతాంగం వ్యవసాయ సాగు పనులు కొనసాగుతున్న నేపథ్యంలో.. అకాల వర్షాల వల్ల రాష్ట్ర వ్యవసాయ రంగంలో తలెత్తిన పరిస్థితులను అంచనా వేస్తూ అనుసరించవలసిన ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాలపై మంత్రివర్గం చర్చించనుంది.

రాష్ట్రంలో ఉధృతంగా కురిసిన వర్షాల వల్ల వాగులు, వంకలు పొంగిపొర్లి రోడ్లు తెగిపోవడం, రవాణా మార్గాలకు జరిగిన నష్టాలపై అంచనా వేసి తగు చర్యలు చేపట్టనున్నారు. యుద్ధప్రాతిపదికన రోడ్ల పునరుద్ధరణకు ఇప్పటికే నిర్ణయించారు. ఆర్టీసీకి సంబంధించిన అంశాలపై కూడా కేబినెట్‌లో చర్చ జరిగే అవకాశం ఉంది. ఉద్యోగులకు జీతభత్యాల పెంపు తదితర అంశాలపై చర్చించనున్నారు.

## కాంగ్రెస్ నిరసన..

# జీహెచ్ఎంసీ గేట్లు క్లోజ్..

**హైదరాబాద్, జూలై 28 (తెలుగుప్రభ)**



ముంపు ప్రాంత సమస్యల పరిష్కారంపై తెలంగాణ కాంగ్రెస్ జీహెచ్ఎంసీ ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా కార్యాలయం వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. కమిషనర్ తో మాట్లాడేందుకు ఐదుగురికి అనుమతి ఇచ్చినప్పటికీ.. పార్టీ శ్రేణులంతా మూకుమ్మడిగా రావడంతో కార్యాలయం గేట్లను మూసివేశారు. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది కూడా లోపలకు వెళ్లేందుకు మూడు గంటల పాటు ఇబ్బందులు పడ్డారు. ఐడీ కార్డు చూపించినప్పటికీ.. ఇప్పుడు పంపించేది లేదని పోలీసులు వెనక్కి పంపారు. డల్లాస్ ఎక్కడుంది అని అడిగితే కమిషనర్ సీరియస్‌గా వెళ్లిపోయారని కాంగ్రెస్ నేత అంజన్ కుమార్ యాదవ్ ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మల్లు రవి, లింగోజిగూడ కార్పొరేటర్ రాజశేఖర్ రెడ్డి, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి, ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నోముల ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో..**

సికింద్రాబాద్ 29 ( తెలుగు ప్రభ) కాంగ్రెస్ నేత నోముల ప్రకాశరావు ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్ కార్యాలయం ముట్టడికి పార్టీ శ్రేణులు తరలివచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్నారు. అమరవీరుల స్తూపం అసెంబ్లీ నుంచి పాదయాత్రగా బయలుదేరి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు.

## దయచేసి వినండి..

### చెత్త కుప్పలతో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకు ఇబ్బందులు

**మలక్‌పేట, జూలై 28 (తెలుగుప్రభ)**

చెత్త కుప్పలతో ప్రజలే కాదు.. విద్యుత్ సిబ్బందికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల మరమ్మతులు చేయాల్సి వస్తే ఆ కుప్పల్లోంచి వెళ్లలేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. మలక్ పేట నియోజకవర్గ వర్గంలోని అజంపురా, మూసా నగర్, వినాయక వీధి, కలా డేరా బస్తీల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. ట్రాన్స్ ఫార్మర్ల వద్ద చెత్త పేరుకు పోవడంతో మరమ్మతుల సమయంలో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవి సమయంలో అయితే చెత్త కుప్పలతో అగ్ని ప్రమాదాలు జరిగిన ఘటనలు కూడా ఉన్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెత్త వేయవద్దని అధికారులు కోరుతున్నారు





## దట్టీ సమర్పణ

స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్ కుమార్ చారిత్రక బీబీకా ఆలవాను దర్శించి దట్టీ సమర్పించారు. ఆయన వెంట డీసీపీ సాయి చైతన్య కూడా ఉన్నారు.

– హైదరాబాద్, (తెలుగుప్రభ)



## భారత సంతతికి చెందిన వ్యక్తికి జైలుశిక్ష

**లండన్, జూలై28(తెలుగుప్రభ):**

**బ్యాంకు అధికారిగా, పోలీసుగా నటించి వృద్ధదంపతుల నుంచి 2.60 లక్షల పౌండ్లు కాజేసిన భారత సంతతికి చెందిన కిషన్‌భట్‌కు జైలు శిక్ష పడినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. తొమ్మిది మోసాలకు పాల్పడినందుకు స్నేర్స్‌బ్రూక్ క్రౌన్ కోర్టు అతనికి శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.**